విజ్ఞాన నిలయాలు గ్రంథాలయాలు

- గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం
- నెహ్రూకు నివాళులర్పించిన నేతలు

మామిడికుదురు: గ్రంథాలయాలు ప్రజలకు అవసరమైన ఎంతో విజ్ఞానాన్ని అందిస్తున్నాయని ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు పేర్కొన్నారు. మామిడికుదురులో గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు కె.సూర్యనారాయణ, యెరుబండి కన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: జాతీయ నాయకులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నెహ్రూ చిత్రపటానికి చిట్టిబాబు పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పాఠశాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన వంట పాత్రలు, లైబ్రరీ పుస్తకాలను చిట్టిబాబు హెచ్‌ఎంకు అందజేశారు. ఎంఈఓ కోన హెలీనా, అడ్డగళ్ల వెంకట సాయిరామ్ పాల్గొన్నారు.

కొత్తపేట: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని ప్రజలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి అన్నారు. స్థానిక ఉప గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వై.చంద్రశేఖరం ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, సీడీపీఓ పి.శారద ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. మోడేకుర్రులో హెచ్‌ఎం ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు ఆధ్వర్యాన ఘనంగా ప్రారంభించారు.



నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



కొత్తపేటలో సరస్వతీదేవి, నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



మలికిపురంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈవో విజయశ్రీ తదితరులు

మలికిపురం: మండలంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. మలికిపురం గ్రంథాలయంలో వారోత్సవాలతో పాటు బాలల దినోత్సవం కూడా నిర్వహించారు. మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి ఎంఈఓ విజయశ్రీ, బహుజన సమాఖ్య అధ్యక్షుడు గెద్దం తులసీ భాస్కరరావు, సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని పలు గ్రంథాలయాలు, స్కూళ్లలో బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు.

సఖినేటిపల్లి: మండలంలోని సఖినేటిపల్లి, అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

అంబాజీపేట: పుస్తక పఠనం మనిషి నడవడిలో మార్పు తీసుకువస్తుందని వైస్ ఎంపీపీ సూదాబత్తుల లక్ష్మీభార్గవి అన్నారు. అంబాజీపేటలో గ్రంథాలయ వారోత్సవాలను శాఖా గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం ప్రారంభించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తొండవరం, అంబాజీపేట, జి.అగ్రహారం జెడ్పీ హైస్కూళ్లలో మంగళవారం నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఆత్రేయపురం: గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనం చేసి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయ అధికారి తమ్మా నమశ్శివాయ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయ ఆవరణలో బాలల దినోత్సవంలో భాగంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి జాతీయ పతాకావిష్కరణ చేశారు.

రాజోలు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ రేవు జ్యోతి జాతీయపతాకాన్ని ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని నెహ్రూ, సరస్వతి దేవి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం నిర్వహించారు. ఆలమూరు ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అలాగే మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

రావులపాలెం: విజ్ఞాన భాండాగారాలుగా గ్రంథాలయాలకు గుర్తింపు ఉందని నేటి యువత లైబ్రరీలను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ బీవీవీఎస్ మూర్తి అన్నారు. గ్రంథాలయ పితామహుడు ఎస్సార్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అయినవిల్లి: మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని మాగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేసి అభినందించారు. సేవా ఫౌండేషన్ అధ్యక్షురాలు పుణ్యమంతుల రజని చేస్తున్న సేవా కార్యక్రమాలను వక్తలు కొనియాడారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు

సఖినేటిపల్లి: రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ కార్యక్రమాలు అందించడం ఒక్క సీఎం జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యం అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం సఖినేటిపల్లిలో ఎమ్మెల్యే రాపాక, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజల కష్టాలన్నీ తీరేలా మంచి పరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌కు మరోసారి అధికారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. జెడ్పీటీసీలు దొండపాటి అన్నపూర్ణ, మట్టా శైలజ, ఎంపీపీ వీరా మల్లిబాబు, కోఆప్షన్ మెంబర్ బళ్ళ నోబుల్ ప్రభాకర్, ఎంపీటీసీలు నల్లి రత్నకుమార్, కె.శుభాకర్, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ పెదపాటి నాగలక్ష్మి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లి ప్రేమానందం, జేసీఎస్ మండల ఇన్‌ఛార్జ్ నల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సఖినేటిపల్లిలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

గ్రామాలను అభివృద్ధి చేస్తున్న జగన్

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.40 లక్షలతో నరేంద్రపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం పనుల్లో పని చేస్తూ ఇటీవల చిట్టూరి సీతమ్మ మృతి చెందగా, ఆమె భర్త కృష్ణమూర్తికి రూ.50 వేల చెక్కును చిట్టిబాబు అందజేశారు.

కార్యక్రమాల్లో సర్పంచ్‌లు బీర వెంగమాంబ, కొంబత్తుల ఏసుబాబు, సొసైటీ చైర్మన్ మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, ఆర్‌బీకే చైర్మన్ జల్లి శ్రీను, రాయుడు చిన్న తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నేతల ఓంరావు తదితర బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే చిట్టిబాబు పరామర్శించి బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, నేలపూడి సత్యనారాయణ, దేశిరాజు సీతారామయ్య, కొంబత్తుల శేఖర్, గుత్తుల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



నరేంద్రపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మరలా సీఎం జగనే రావాలి

అయినవిల్లి: మరలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం అయినవిల్లి మండలం తొత్తరమూడి సచివాలయం–1 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం కుడుపూడి విద్యాసాగర్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తొలుత వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే, అధికారులు తొత్తరమూడిలో డీబీటీ కింద ప్రజలకు అందించిన లబ్ధిని డిస్‌ప్లే ద్వారా ఆవిష్కరించారు. గ్రామాభివృద్ధి కోసం రూ.19 కోట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో తొత్తరమూడిలో ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. గ్రామంలో సమస్యలను చర్చించి పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చిన బాబు, వారా లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కె.చిట్టిబాబు మాట్లాడారు. ఆయా శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. వీరవల్లిపాలెం సర్పంచ్ సలాది బుచ్చిరాజు మాట్లాడుతూ గ్రామ కంఠం స్థలంలో వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని పలువురు అడ్డుకుంటున్నానని రెవెన్యూ అధికారులు సర్వే చేయించాలని కోరారు. దీనికి తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ మాట్లాడుతూ త్వరలో సర్వే చేయిస్తామని సర్పంచ్‌కు బదులిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, జెడ్పీటీసీ జి.శ్రీనివాసరావు హాజరయ్యారు.

అంబాజీపేట: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సంక్షేమానికి క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు అన్నారు. మాచవరం సచివాలయం–1లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వాసంశెట్టి వెంకన్న ఇంటి వద్ద పథకాలపై చర్చించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, పేరి శ్రీనివాస్, సూదాబత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: మండలంలోని జి.పెదపూడిలో మంగళవారం పార్టీ జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు ఆధ్వర్యంలో 'ఏపీకి సీఎం జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారుల బోర్డును ఆవిష్కరించారు. రాత్రి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్ దంగేటి అన్నవరం, పార్టీ నాయకులు సాధనాల రమేష్, కుప్పాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తప్పనిసరిగా రాష్ట్ర సీఎంగా జగనే రావాలని జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం మంగళవారం కొమరాడలో జరిగింది. సర్పంచ్ వలవల సత్యవేణి అధ్యక్షతన ఈ సభ జరిగింది. ఎంపీటీసీ వలవల పెదపబాబు, పార్టీ నేతలు బొలిశెట్టి భగవాన్, కటకంశెట్టి ఆదిత్యకుమార్, సూరిశెట్టి బాబి, ఎండీ వై.షరీఫ్, చేట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



తొత్తరమూడిలో డీబీటీ డిస్‌ప్లే ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

నేటి నుంచి ధర్మ ప్రచార వారోత్సవాలు

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ–ధర్మదాయ శాఖ ఉత్తర్వుల మేరకు మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం నుంచి ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి తెలిపారు. వారోత్సవాలను పురస్కరించుకుని మందపల్లి పరిసర గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దానిలో భాగంగా ఈ నెల 15న మందపల్లి గ్రామ దేవత లంకాలమ్మతల్లి ఆలయంలో, 16న కొత్తపేట శివారు ఏనుగులమహల్‌లోని రాజరాజేశ్వరీదేవి (శ్రీచక్ర మహామేరు యంత్రం) ఆలయంలో, 17న రావులపాలెం మండలం దేవరపల్లి శివారు చెల్లిరేవు రామాలయంలో, 18న పెంకులపాటిగరువు రామాలయంలో, 19న కొత్తపేట శివారు శీలంవారిపాలెం రామాలయంలో, 20న కపిలేశ్వరపురం మండలం కేదార్లంక లక్ష్మీగణపతిస్వామి వారి ఆలయంలో, 21న రావులపాలెం మండలం కొమరాజులంక పార్వతీవీరేశ్వరస్వామి వారి ఆలయంలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ అభిషేకాలు, కుంకుమ పూజలు, కళ్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు ఏసీ అండ్ ఈఓ విజయలక్ష్మి తెలిపారు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనకు అవకాశాలు

అంబాజీపేట/అయినవిల్లి: కొబ్బరి ఆధారిత భారీ, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు మంచి అవకాశాలున్నట్లు కొబ్బరి అభివృద్ధి బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేలు చెప్పారు. కృషివల కోకోనట్ ఫార్మర్స్, ప్రొడ్యూసర్ కంపెనీ నేదునూరులో నిర్మాణంలో ఉన్న హైటెక్ నర్సరీని జిల్లా ఉద్యాన అధికారి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీవీ రమణరావు సందర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ నాలుగు జిల్లాల ఇంచార్జ్ సుభాష్, మారుతి, కొబ్బరి అభివృద్ధి బోర్డు డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేలు మాట్లాడుతూ కొబ్బరి ఆధారిత భారీ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్జిన్ కోకోనట్ ఆయిల్, డెసికేటెడ్ పౌడర్, మిల్క్, ఎడిబుల్ ఆయిల్, నటాడీ కోకో, కోకోనట్ వెనిగర్‌ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వినియోగించుకుని ఆర్థిక పురోభివృద్ధి చెందాలన్నారు. క్వాయర్ క్లస్టర్ను సందర్శించి అంబాజీపేటలో ఉన్న కృషివల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొబ్బరి ఆధార కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. కోకోనట్ బర్ఫీ తయారీపై లబ్ధిదారులకు దరఖాస్తు నమోదు విధానాన్ని రైతులకు వివరంచారు. 35 శాతం రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పడానికి ఉన్న అవకాశాలను వివరించారు. కోనసీమలో కొబ్బరి ఆధార కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొనేందుకు ఉన్న అన్ని అవకాశాలను వివరించారు. కృషివల చైర్మన్ గణపతి వీరరాఘవులు, డైరెక్టర్లు అడ్డాల గోపాలకృష్ణ, బొక్కా ఆదినారాయణ, ఉప్పుగంటి భాస్కరరావు, యాళ్ల వెంకటానందం, మాకిరెడ్డి పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

సఖినేటిపల్లి: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. మంగళవారం సఖినేటిపల్లి గీతామందిరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చాచా నెహ్రూ జయంతి పురస్కరించుకుని మండల స్థాయిలో బాలల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో జరిగిన సమావేశంలో తహసీల్దారు వై.రామకుమారి, ఎంఈవో–2 మద్దాలి వెంకటేశ్వరరావు, సీడీపీవో రమాదేవి, ఎస్సై ఎస్.రాము ముఖ్యఅతిథులుగా మాట్లాడారు. పిల్లల హక్కుల గురించి, పౌష్టికాహారం, రక్తహీనత, శారీరక శుభ్రత, చైల్డ్ హెల్ప్‌లైన్ 100, 112 టోల్ ఫ్రీ నంబర్లు గురించి అధికారులు వివరించారు.

కార్తికమాస పూజలు ప్రారంభం

మామిడికుదురు/పి.గన్నవరం/ఆత్రేయపురం/అంబాజీపేట/కొత్తపేట/అయినవిల్లి/ఆలమూరు: శివకేశవులకు ప్రీతికరమైన కార్తికమాసం ప్రారంభం కావడంతో మంగళవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున భక్తులు ఆలయాలకు వెళ్లి అభిషేకాలు చేయించుకున్నారు. బి.దొడ్డవరంలోని ఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన జరిగింది. ఉమాదేవికి లక్ష కుంకుమార్చన జరిపించారు. లక్ష మారేడు దళాలతో అర్చన చేశారు. పి.గన్నవరం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి వశిష్ట, వైనతేయ నదీపాయల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శివాలయాలకు వెళ్లి, స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక గరుడేశ్వరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆత్రేయపురం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రధాన శివాలయాల్లో మంగళవారం కార్తిక మాస పూజలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే గౌతమి, వశిష్టా గోదావరుల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పలు గ్రామాల్లోని ప్రసిద్ధ ఆలయాలతో పాటు శివాలయాలకు భక్తులు, అయ్యప్ప మాలధారులు పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణాలు శివనామస్మరణతో మార్మోగాయి. అంబాజీపేట మండలంలో ఉన్న శివాలయాలు వేకువజాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. నెల రోజులూ ప్రతి నీటి బిందువులో పావన గంగ నివసిస్తుందని పెద్దలు చెబుతారు. అభిషేక ప్రియుడైన శివుడిని ఈ నెలరోజులూ జలంలో అభిషేకిస్తే పుణ్యలోక ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. తెల్లవారుజాము నుంచే మహిళలు కాలువలు, చెరువుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కార్తిక దీపాలను వెలిగించారు. కొత్తపేట మండలం పలివెలలో పురాణ ప్రసిద్ధి చెందిన ఉమా కొప్పేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తికమాసం పొడవునా స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆ గ్రామానికి చెందిన ఎంపీపీ మార్గన గంగాధరరావు పర్యవేక్షణలో దేవస్థానం చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, ఈఓ ప్రసాదరాజు ఆధ్వర్యంలో వివిధ ఏర్పాట్లు చేశారు. అలాగే పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయినవిల్లి మండలంలో కార్తికమాసం ప్రారంభం కావడంతో పాడ్యమి దీపాలు వదిలి మహిళలు పూజలు నిర్వహించారు. నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. శివాలయాల్లో స్వామికి అభిషేకాల్లో నిర్వహించారు. అయినవిల్లి, ముక్తేశ్వరం, తొత్తరమూడి, నేదునూరు తదితర గ్రామాల్లో శివాలయాల్లో భక్తులతో పోటెత్తారు. ఆలమూరు మండలంలోని వివిధ శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునే భక్తులు ఆలయానికి చేరుకుని అభిషేకాలు నిర్వహించారు. ఈనెల 14న ప్రారంభమైన కార్తిక మాసం వచ్చే నెల 13 వరకూ ఆధ్యాత్మికతను సంతరించుకుంటుందని వేద పండితులు పేర్కొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ర్యాలి ఉమాకమండలేశ్వర స్వామి



ప్రత్యేక అలంకరణలో పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి

క్లుప్తంగా

మహిళల రక్షణకు దిశా యాప్ తోడ్పాటు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన దిశయాప్ మహిళల భద్రతకు, రక్షణకు విశేష తోడ్పాటును అందిస్తుందని ఎస్సై ఎల్.శ్రీను నాయక్ అన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ ప్రధాన కూడళ్ల వద్ద మంగళవారం గ్రామ, వార్డు మహిళా పోలీసులతో కలసి మహిళలు, యువతకు దిశా యాప్‌పై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ఒంటరిగా ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు ట్రాక్ మై ట్రావెల్ అనే ఆప్షన్ వినియోగించుకోవడం ద్వారా వారు వెళ్లే రూట్‌ను ట్రాక్ చేసే అవకాశం ఉంటుందన్నారు. అలాగే వాహనం సరైన మార్గంలో వెళ్లని పక్షంలో వెంటనే సంబంధిత ప్రాంత పోలీసులను అప్రమత్తం చేస్తుందని తెలియజేశారు.

వైభవంగా 54 కలశాల పూజ



పెదపట్నంలంక కలశ పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

మామిడికుదురు: పెదపట్నంలంకలో అయ్యప్ప స్వామికి 54 కలశాల పూజ మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. కొమ్ముల బాలకృష్ణ స్వామి స్వగృహం వద్ద ఈ పూజ జరిగింది. పలు గ్రామాల నుంచి విశేష సంఖ్యలో వచ్చిన స్వాములు పూజలో పాల్గొన్నారు. మేళ తాళాలు, బాణసంచా కాల్పులతో స్వాములు నృత్యాలు చేస్తూ ముందుగా కలశాలతో వైనతేయ గోదావరి నదికి ఊరేగింపుగా వెళ్లారు. గోదావరి నదీ స్నానమాచరించి అక్కడి నుంచి కలశాలతో జలాలు తీసుకు వచ్చారు. అయ్యప్ప సన్నిధిలో వాటిని ఏర్పాటు చేసి కలశాలకు పూజలు చేశారు. తాటిపాకకు చెందిన పాటబళ్ల కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పూజ జరిగింది. కృష్ణ గురుస్వామి ఆలపించిన ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తులను మంత్రముగ్ధుల్ని చేసింది.

ట్రాక్టర్‌పై ఎండుగడ్డి దగ్ధం

కొత్తపేట: స్థానిక సంత మార్కెట్ ప్రాంతంలో ట్రాక్టర్ ఎండుగడ్డికి విద్యుత్ వైర్లు తగిలి గడ్డి దగ్ధమయింది. మార్కెట్ సమీపాన వరి పొలంలో పశుగ్రాసం ఎండుగడ్డిని పలివెలకు చెందిన ఎం.శ్రీనివాస్ తన ట్రాక్టర్‌పై ఎగుమతి చేసుకుని తరలిస్తుండగా మార్కెట్ ప్రాంతంలో విద్యుత్ వైర్లు తగిలి గడ్డి దగ్ధమవుతుండగా స్థానికులు స్థానిక అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ కేవీవీ రాంప్రసాద్ సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.30 వేలు నష్టం ఉంటుందని ట్రాక్టర్ యజమాని శ్రీనివాస్ చెప్పినట్టు ఫైర్ సిబ్బంది తెలిపారు.

12 లక్షల నారికేళ జలాభిషేకానికి శ్రీకారం



12 లక్షల నారికేళ జలాభిషేకం కార్యక్రమంలో భక్తుల సందడి

మలికిపురం: చింతలమోరిలోని పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి వారికి కార్తిక మాసం తొలి రోజైన మంగళవారం 12 లక్షల నారికేళజలాభిషేకానికి శ్రీకారం చుట్టారు. స్థానిక భక్తుడు దొడ్డా నాగబాబు, శాంతికుమారి దంపతుల ఆధ్వర్యాన స్థానికులు, భక్తులు ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టారు. వచ్చే నెల 12 వరకూ జరిగే ఈ కార్యక్రమంలో రోజు విడిచి రోజు లక్ష కొబ్బరి కాయల చొప్పున మొత్తం 12 లక్షల కాయలు కొట్టి, ఆ జలంతో స్వామివారికి భక్తులు అభిషేకం నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కొబ్బరి కాయలను గ్రామస్తుల నుంచి సేకరించామని చెప్పారు. తొలుత ప్రముఖ వేద పండితుడు ఉండి సుబ్రహ్మణ్యశాస్త్రి, అర్చకుడు విస్సుబాబు ఆధ్వర్యాన స్వామి వారికి నాగబాబు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కొట్టిన కొబ్బరి కాయల నుంచి వచ్చే జలాన్ని డ్రమ్ముల్లోకి పట్టి, అక్కడి నుంచి నేరుగా స్వామివారికి అభిషేకించేలా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, సర్పంచ్ డాక్టర్ రాపాక రమేష్‌బాబు పాల్గొన్నారు.

నమ్మబలికి.. మోసగించి..

అంబాజీపేట: ఏటీఎం ద్వారా నగదు డ్రా చేసేందుకు ఓ వ్యక్తిని సాయం అడగడంతో ఆ వ్యక్తి తెలివిగా కార్డు మార్చి వేరే ఏటీఎంలో నగదు డ్రా చేసుకుని పరారైన సంఘటన ఇది. ఇరుసుమండ గ్రామానికి చెందిన వీరంశెట్టి వెంకటేశ్వరరావు ముక్కామల ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వెళ్లాడు. అతనికి ఏటీఎంలో డబ్బులు డ్రా చేసే విధానం తెలియకపోవడంతో అక్కడే ఉన్న ఓ వ్యక్తిని డబ్బులు డ్రా చేయమని సాయం అడిగాడు. దీంతో ఆ వ్యక్తి ఏటీఎం పిన్ నంబర్ చెప్పమని వెంకటేశ్వరరావును అడిగి, ఆ యువకుడి వద్ద ఉన్న కార్డు ఏటీఎంలో పెట్టి కార్డు మార్చి డబ్బులు రావడం లేదని వెంకటేశ్వరరావును నమ్మబలికి ఆ కార్డుని తీసుకుని అక్కడ నుండి వెళ్లిపోయాడు. వెంకటేశ్వరరావు తన వద్ద ఉన్న కార్డును సరిచూసుకునే 15 నిమిషాల వ్యవధిలో అంబాజీపేట ఏటీఎంకు వెళ్లి ఆ వ్యక్తి రెండు విడతలగా రూ.17 వేలు నగదు డ్రా చేశాడు. దీనిపై వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం

ఆలమూరు: గ్రామ శివారు కొత్తూరు సెంటర్‌లోని ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో బుధవారం జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరగనుందని తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. స్థానిక ఎంపీడీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ స్పందనలో అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలెవరికైనా సమస్యలుంటే సత్వరమే జిల్లా కలెక్టర్ సమక్షంలో అర్జీలు సమర్పించుకోవచ్చన్నారు. అర్జీదారుడు వెంట ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు.

రమణీయంగా కల్యాణోత్సవం

మామిడికుదురు: ధర్మ ప్రచారం వారోత్సవంలో భాగంగా అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవం మంగళవారం లూటుకుర్రులో రమణీయంగా జరిగింది. శివాలయం ప్రాంగణంలో జరిగిన ఈ కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేద పండితులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు, జ్యోత్స్నల సోమయాజులు నేతృత్వంలో వైభవంగా జరిపించారు. జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ అడబాల తాతకాపు, ట్రస్టు బోర్డు సభ్యులు కొమ్ముల సూరిబాబు, చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీను, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

అంబాజీపేట: పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఓ రైసు షాపుపై రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్, పౌరసరఫరాల శాఖ అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముక్కామలలో వెంకటలక్ష్మి రైసు షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 1,275 కేజీల బియ్యాన్ని గుర్తించారు. దాంతో షాపు యజమాని ఏలేశ్వరపు రాధాకృష్ణారావుపై 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం బియ్యంను సీజ్ చేశారు. స్వాధీన పర్చుకున్న పీడీఎస్ బియ్యాన్ని అంబాజీపేట ఎంఎల్ఎస్ పాయింట్‌కు భద్రత నిమిత్తం తరలించినట్లు ఎమ్మెస్వో రమాదేవి తెలిపారు. వీరి వెంట రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు ఉన్నారు.

బస్సుల్లో దొంగతనాలు చేస్తున్న మహిళ అరెస్ట్

రావులపాలెం: బస్సుల్లో ప్రయాణిస్తున్న వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు రావులపాలెం ఎస్సై ఎం.వెంకటరమణ మంగళవారం తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను అరెస్టు చేసి విచారించగా రెండు వేర్వేరు కేసుల్లో దొంగలించిన 150 గ్రాముల బంగారు వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. తాడేపల్లిగూడెంకు చెందిన పుప్పాల గోరి అలియాస్ సయ్యద్ గోరి గత సంవత్సరం డిసెంబర్ నెలలో తణుకు నుంచి రావులపాలెం బస్సులో వస్తున్న మహిళ నుంచి చోరీ చేసిన బంగారు వస్తువులు, ఈనెల 8న అమలాపురం నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న బస్సులో ఒక మహిళ వద్ద దొంగిలించిన బంగారు నెక్లెస్ మొత్తంగా రెండు కేసుల్లో కలిపి సుమారు 150 గ్రాములు బంగారు వస్తువులను స్వాధీనం చేసుకని, ముద్దాయిని అరెస్టు చేసి కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టుకి రిమాండ్ నిమిత్తం పంపగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

వెండి పట్టీలు దొంగిలించిన మరో ఇద్దరు..

నగల షాపులోకి కొనుగోలుకు వచ్చినట్టు నటించి వెండి పట్టీలు దొంగిలించిన ఇద్దరు మహిళా దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 270 గ్రాముల రెండు జతల పట్టీలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఎం.వెంకటరమణ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మార్కెట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వైజాగ్ అల్లిపూడికి చెందిన చాపల లక్ష్మి, గుండుబోయిన అప్పల నరసమ్మలను అరెస్టు చేసి విచారించగా ఈనెల 11న స్థానిక ఆకుల జూయలర్స్‌లో సుమారు 270 గ్రాముల రెండు జతల వెండి పట్టీలు దొంగిలించినట్టు గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకుని ముద్దాయిలను అరెస్ట్ చేసి కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టుకి రిమాండ్ నిమిత్తం పంపగా, 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

ఎస్సీ రాజకీయ రిజర్వేషన్లు ఎత్తివేయాలంటూ నిరసన

మామిడికుదురు: ఎస్సీ రాజకీయ రిజర్వేషన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాలు మంగళవారం మామిడికుదురు బస్టాండ్ కూడలిలో ఒక్క రోజు దీక్ష చేపట్టాయి. దీనిలో భాగంగా జాతీయ రహదారి పక్కన నిల్చుని ధర్నా చేశారు. దేశ వ్యాప్తంగా దళితులు, క్రైస్తవులు, ముస్లింలు, గిరిజనులపై నిత్యం ఏదో ఒక ప్రాంతంలో దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల ద్వారా ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిచిన అనంతరం ఎస్సీ ప్రజా ప్రతినిధులు ఎస్సీల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. దీక్షలో భూపతి వెంకటపతి, బొంతు మణిరాజు, కలిగితి పళ్లంరాజు తదితరులు కూర్చున్నారు. వీరికి పలు దళిత సంఘాలు మద్దతు తెలిపాయి.

మధుమేహం నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఆలమూరు: మధుమేహ నివారణకు ప్రత్యేకశ్రద్ధ తీసుకుని ఆహార నియమాలు పాటించాలని ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రాంబాబు అన్నారు. మండలంలోని మూలస్థాన అగ్రహారంలో ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవానికి సర్పంచ్ లంక వరప్రసాదరావు అధ్యక్షత వహించారు. సుగర్ వ్యాధి వల్ల వచ్చే సమస్యలను, పాటించవలసిన ఆహార నియమాలను ప్రజలకు వివరించారు.